క్లుప్తంగా

వివాహ వేడుకల్లో మాజీ మంత్రి ఆదిమూలపు



వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి సురేష్

కొండపి: మండలంలోని ముప్పరాజుపాలెం వైఎస్సార్ సీపీ కార్యకర్త నజీర్ వివాహ వేడుకల్లో పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేష్ వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఆరికట్ల కోటిలింగయ్య, జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, సీనియర్ నాయకులు బొక్కిసం సుబ్బారావు, సుబ్బయ్య, మండవ మాల కొండయ్య, మోపర్తి నారాయణ, వస్నూరు, చిన్నబ్బి, వసంత్, మండల నాయకులు పాల్గొన్నారు.

21 మద్యం బాటిళ్లు స్వాధీనం



సీజ్ చేసిన మద్యం బాటిళ్లు

పీసీపల్లి: మండల పరిధిలోని తురకపల్లి బెల్టు షాపు నిర్వహిస్తున్న కంసాని వెంకట కొండయ్య వద్ద 21 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కోటయ్య తెలిపారు. గతంలో కూడా ఇతనిపై రెండు మద్యం విక్రయం కేసులు ఉన్నాయని, కనిగిరి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. మండలంలో ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైద్య సిబ్బందితో సమీక్ష



పీహెచ్‌సీ వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీపీఎంఓ వాణిశ్రీ

కొండపి: స్థానిక హెల్త్ సెంటర్‌లో పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో డీపీఎంఓ వాణిశ్రీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర బృందం ఆన్‌లైన్‌లో క్వాలిటీ స్టాండర్స్‌పై విజిట్ చేస్తుంటారని, అందులో ఏం అడుగుతారు, ఎలా సమాధానం ఇవ్వాలనే దానిపై తెలియజేశారు. పెట్లూరు పీహెచ్‌సీ వైద్యురాలు అనూష, క్వాలిటీ మేనేజర్ మురళీకృష్ణ, డాక్టర్ ప్రియాంక, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు. అనంతరం పెద్దకండ్లగుంట హెల్త్ సెంటర్ను సందర్శించి రికార్డులు పరిశీలించారు.

రసాయనిక మందుల వాడకం తగ్గించండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ యుగంధర్‌రెడ్డి

జరుగుమల్లి(సింగరాయకొండ): పంటల సాగులో రసాయనిక మందుల వాడకం తగ్గించి భూసారాన్ని పరిరక్షించాలని వ్యవసాయాధికారి పి. యుగంధర్ రెడ్డి అన్నారు. మండలంలోని కామేపల్లి, కె.అగ్రహారం గ్రామాల్లో గురువారం పొలంబడి, ప్రపంచ నేల దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రబీ సీజన్‌లో ఆరు రకాల పంటలకు బీమా వర్తిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శైలజ, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలేఖ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన సుధాకర్

కొండపి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం స్థానిక కోల్డ్ స్టోరేజ్ వద్ద జరిగింది. స్థానికుల తెలిపిన సమాచారం మేరకు.కొండపి గ్రామానికి చెందిన భాస్కరుని సుధాకర్ బైక్‌పై కొండపి నుంచి సంతనూతలపాడు వైపు వెళ్తున్నాడు. కొండపి గ్రామ శివారులోని కోల్డ్ స్టోరేజీ వద్ద జింకలు అడ్డు రావడంతో వాటిని తప్పించే క్రమంలో బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. బైక్ అదుపు తప్పి రోడ్డు మీద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే కొండపిలోని స్థానిక ప్రభుత్వ వైదశాలకు తరలించారు. గాయం తీవ్రంగా ఉండడంతో తదుపరి చికిత్స నిమిత్తం వైద్యుల సూచన మేరకు ఒంగోలుకు తరలించారు.



కట్టనుండి రిజర్వాయర్ తొట్టివరకు కంప చెట్లతో నిండిన మోపాడు రిజర్వాయర్



కంపకర్ర, పిచ్చిచెట్లతో నిండిన పాములూరు పాత చెరువు పంట కాల్వ

చెరువులపై చిన్నచూపు..!



కంపకర్ర, పిచ్చిచెట్లతో నిండిన మోపాడు రిజర్వాయర్



కంపకర్ర, పిచ్చిచెట్లతో నిండిన పాములూరు కొత్త చెరువు

- వర్షాలు కురుస్తున్నా పూర్తిస్థాయిలో నిండని చెరువులు
- కంపచెట్లు, పిచ్చిమొక్కలతో నిండిపోయి తగ్గిపోతున్న నీటి నిల్వ సామర్థ్యం
- చెరువులను పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఆయకట్టు రైతుల్లో ఆందోళన

పాములూరు:

గత రెండు నెలలుగా అడపా దడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో పంటల సాగుకు ఆయకట్టు పరిధిలోని రైతులు సమాయత్తమవుతున్నారు. అయితే వర్షాలైతే కురుస్తున్నాయి గానీ ఆ స్థాయిలో నీటిని నిల్వ చేసే సామర్థ్యం ప్రస్తుతం చెరువులకు లేదు. మండలంలోని ముఖ్యమైన చెరువులన్నీ కంపచెట్లు, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి ఉన్నాయి. దీంతో ఏటికేడు వాటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుండటంతో రైతులకు శాపంగా మారింది. చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గడం ద్వారా క్రమేపి సాగుకు సరిపడా నీరు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఉన్న ఒక మీడియం ఇరిగేషన్ రిజర్వాయర్ మోపాడుతో పాటు 10 మైనర్ ఇరిగేషన్ చెరువు తొట్టి ప్రాంతం, అటు కట్టలు కంపకర్ర చెట్లు, పిచ్చిచెట్లు పెరిగి అడవులను తలపిస్తున్నాయి. ఈ చెరువుల ఆయకట్టు పరిధిలో అధికారికంగా 15,799 ఎకరాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఒక్కోసారి వర్షాభావ పరిస్థితులతో సంవత్సరాల పాటు వర్షాలు లేక చెరువులు కంపచెట్లు మొలిచి చిట్టడవిలా తయారవుతున్నా వాటిని తొలగించి చెరువులను ఆధునికీకరించేందుకు అటు అధికారులు, ఇటు పాలకులు పట్టించుకున్న దాఖలాలులేవు. వర్షాలు వచ్చి వరదలు వచ్చిన సమయంలో పూడిక, అప్పటికే ఉన్న చెట్లతో చెరువుల్లో నీటినిల్వ సామర్థ్యం తగ్గి సాగుకు పంటలకు సరిపడా నీటి నిల్వలు లేకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడి సాగుకు సెలవు ప్రకటించే పరిస్థితి నెలకొంది.

ప్రశ్నార్థకంగా ఆయకట్టు..

మండలంలో ఉన్న ఏకైక మీడియం ఇరిగేషన్ రిజర్వాయర్ మోపాడుతో పాటు మిగిలిన 10 చెరువులు సైతం పూర్తిగా వర్షాధారంమీద ఆధారపడ్డవే. మోపాడు మీడియం ఇరిగేషన్ రిజర్వాయర్ ఆయకట్టు ప్రకాశం జిల్లాలో పాములూరు మండలం, నెల్లూరు జిల్లాలో కొండాపురం మండలంలో కలిపి మొత్తం 12,719 ఎకరాలు. మైనర్ ఇరిగేషన్ చెరువులైన పాములూరు పాతచెరువు కింద 380.18, దూబగుంట్ల చెరువుకింద 137.06, వగ్గంపల్లి చెరువుకింద 360, పడమటి కట్టకిందపల్లి చెరువుకింద 650, చట్టుమడుగు చెరువుకింద 70, నుచ్చుపొద చెరువుకింద 68, బోడవాడ చెరువుకింద 385, రేణిమడుగు చెరువుకింద 370, సిద్ధవరం చెరువు కింద 200, మాలకొండాపురం చెరువుకింద 460 ఎకరాలు మొత్తం మోపాడు రిజర్వాయర్‌తో కలిపి 15,799.24 ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. ఆయా రిజర్వాయర్లలో చెట్లను, పూడికను తొలగించి నీటి నిల్వ సామర్థ్యం పెంచి పంటల సాగుకు నీరు నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతాం:

రిజర్వాయర్ కట్టలపై, కాల్వలో ఉన్న చెట్లను తొలగించే విషయమై ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం. రిజర్వాయర్ తొట్టిప్రాంతంలో ఇరిగేషన్ అధికారుల అనుమతితో పంచాయతీవారు చెట్లను తొలగించుకోవచ్చు. తద్వారా ఆయకట్టు రైతులకు లాభం చేకూరుతుంది.

సీహెచ్ ప్రసాద్, ఇరిగేషన్ ఏఈఈ

చెరువు, రిజర్వాయర్‌లలో చెట్లు తొలగించాలి:

మోపాడు రిజర్వాయర్‌తో పాటు మిగిలిన చెరువు తొట్టి ప్రాంతాల్లో కంపకర్ర చెట్లను తొలిగించి చెవురుల్లో నీటినిల్వ సామర్థ్యం పెంపుపై అధికారులు, పాలకులు దృష్టిసారించాలి. అదేవిధంగా కట్టపై చెట్లను తొలగించి బలోపేతం చేయాలి. పంట కాల్వల్లో చెట్లను తొలగించి సాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి.

అంబటి కొండారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన చింతలచెరువు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చింతలచెరువు

కనిగిరిరూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కనిగిరి నియోజకవర్గ సీనియర్ నాయకుడు, రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి గురువారం తాడేపల్లి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

భూసార పరీక్షలతో పంటల ఎంపిక సులభం



భూసార పరీక్షల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఏఓ సంపత్‌కుమార్



ప్రమాణం చేస్తున్న తహసీల్దార్, ఏఓ, వీఆర్‌ఓలు, వీఏఏలు

సీఎస్‌పురం(పాములూరు): భూసార పరీక్షలతో పంటల ఎంపిక సులభతరమని వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని పెదగోగులపల్లెలో గురువారం ప్రపంచనేల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భూసార పరీక్షలు చేయించుకునే విధానాన్ని రైతులకు వివరించారు. భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా తదనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుని సాగు చేసుకోవచ్చని, అవసరమైన మేరకే ఎరువులు వేసుకోవచ్చన్నారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని సూచించారు. రైతులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించి గతంలో నిర్వహించిన భూసార పరీక్షల ఫలితం ధ్రువీకరణ పత్రాలు రైతులకు అందజేశారు. ఉద్యానవనశాఖ సీహెచ్.వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

పాములూరు: మనిషి జీవనానికి నేల, నీరే మూలమని తహసీల్దార్ బీవీ రమణారావు, వ్యవసాయాధికారి కంచం రాధ అన్నారు. నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. నేల, నీరు కాలుష్యానికి దారితీస్తున్న పరిస్థితులు, సంరక్షణ మార్గాల గురించి వివరించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలన్నారు.

పొలాల్లోని నీటిని బయటకు పంపాలి

కొండపి: పొగాకు పంట పొలాల్లో నిల్వ నీటిని వెంటనే బయటకు పంపించాలని కొండపి వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ అన్నారు. బోర్డు పరిధిలోని పెట్లూరు, కోయవారిపాలెం, ధర్మవరం, జువ్విగుంట, పెద్దకళ్లగుంట, జాళ్లపాలెం, పెరిదేపి, ముప్పవరం గ్రామాల్లోని పొగాకు పంట పొలాలను పరిశీలించి, అధిక వర్షపాత సమయంలో పొగాకు పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో మురికి నీరు బయటకు పోయేలా కల్పించాలని, శిలీంద్రాలు సోకిన పొలాలకు బ్లైట్ టాక్స్ లేదా అమిస్టార్ లేదా క్యాబ్రియోటాప్తో పిచికారీ చేయాలన్నారు. ఐటీసీ డెవలప్‌మెంట్ మేనేజర్ కేవీ రత్నం, పొగాకు బోర్డు సిబ్బంది, ఫీల్డ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు



హనుమంతునిపాడులో పొంగి పొర్లుతున్న ఎర్రవాగు



హనుమంతునిపాడు పొలాల్లో నుంచి వస్తున్న వర్షం నీరు

దంచికొట్టిన జడివాన

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- నీట మునిగిన పంట పొలాలు

కనిగిరిరూరల్(హనుమంతునిపాడు): కనిగిరిలో గురువారం భారీ వర్షం కురిసింది. వేకువజాము నుంచే ప్రారంభమైన వర్షం ఉదయంవరకు కురుస్తూనే ఉంది. భారీ వర్షానికి కనిగిరి పట్టణంలో మోకళ్ల లోతు నీరు పారాయి. డ్రైనేజీలు పొంగి పొర్లడంతో కొన్ని ప్రాంతాల్లో రోడ్లపైకి, ఇళ్లలోకి నీరు వచ్చాయి. స్థానిక రెవెన్యూ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం, రిజిస్ట్రార్ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలోనూ వర్షం నీటితో కుంటలను తలపించాయి. కొత్తూరు వద్ద పామూరు, కనిగిరి జాతీయ రహదారిలో వాగులు పొంగి పొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నాగులచెరువు, కనిగిరి పెద్దచెరువులకు భారీ ఎత్తున వర్షం చేరింది. భారీ వర్షానికి చాకిరాల, అగ్రహారం, మాచవరం, పొనుగోడు, చల్లగిరిగల, ఎడవల్లి, నందరమారెళ్ల బడుగులేరు, తుమ్మకుంట గ్రామాల్లో సాగు చేసిన శనగ, మిరప, కంది, పొగాకు తోటలు నీట మునిగి దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగులచెరువు కాలువ పొంగిపొర్లుతుంది. భారీ వర్షాలకు కనిగిరిలోని లోతట్టు ప్రాంతాలు నీట మునిగే అవకాశం ఉండటంతో తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా నాగులచెరువు, కనిగిరి పెద్ద చెరువు, ఎన్ గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద, తూము వద్ద నుంచి పోతున్న నీటిని, కొత్తూరు వద్ద పొంగి పొర్లుతున్న వాగులను పరిశీలించారు. కనిగిరి మండలంలోని ఎన్ గొల్లపల్లి వద్ద చెరువు కాలువలు పొంగి పొర్లి కట్ట తెగే ప్రమాదం ఉందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షంతో మండలంలో సాగులో ఉన్న పంటలన్నీ నీట మునిగాయి. వర్షం ఇదే విధంగా కొనసాగితే పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్‌లు ఎన్‌గొల్లపల్లి చెరువును పరిశీలించారు. తూము వద్ద నుంచి వెళుతున్న నీటిని బయటకు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కనిగిరి పెద్ద చెరువు, నాగులచెరువులోకి వచ్చిన నీటిని పరిశీలించారు.

హనుమంతునిపాడు: మండలంలో గురువారం కురిసిన భారీ వర్షానికి పంటలన్నీ నీట మునిగాయి. గురువారం అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. భారీ వర్షంతో ఎర్రవాగు, కొండవాగుల, దోమలేరు పొంగి పొర్లుతున్నాయి. దొడ్డిచింతల, నందనవనం, మిట్టపాలెం, చెరువులకు భారీగా నీరు చేరింది. హనుమంతునిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వర్షం నీరు భారీగా చేరి తరగతి గదుల్లోకి నీరు చేరింది. దాసళ్లపల్లి, ముప్పాళ్లపాడు, కూటాగుండ్ల, సీతారాంపురం, హాజీపురం, దొడ్డిచింతల, హనుమంతునిపాడు, కొండారెడ్డిపల్లి, మొరవారిపల్లి, వెంగపల్లి, ఎలికవారిపల్లి గ్రామాల్లో సాగు చేసిన కంది, వరి, మిరప, అలసంద, మిరప, వేరుశనగ తోటల్లో మోకాలి లోతు నీరు చేరింది. వర్షం ఇదే విధంగా కొనసాగితే పంటలు ఉరకెత్తి దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు రాయి చిన్నపురెడ్డి, గాయం వెంకటరెడ్డి, తాతిరెడ్డి రామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కోత కోచ్చిన వరి పైరు దెబ్బతింటుందంటున్నారు.

టంగుటూరు: మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. వర్షంతో గ్రామాల్లో, పొగాకు బోర్డు వద్ద నీరు చేరింది. తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీలో రోడ్లపైకి, ఇళ్లలోకి వర్షం నీరు చేరాయి. బస్టాండ్ ప్రాంతం అంతా వర్షం నీటితో జలమయమైంది. టంగుటూరు కొండపి జాతీయ రహదారి ఫ్లైఓవర్ కింద భారీగా వర్షం నీరు చేరి వాహనదారులు పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్టాండ్‌లోకి ప్రవేశించడానికి పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పామూరు: తుఫాన్ కారణంగా మండలంలో నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలకు మండలంలో 1456 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారి కంచం రాధ తెలిపారు. పంటలు ముఖ్యంగా వగ్గంపల్లె, రావిగుంటపల్లె, మార్కొండాపురం, పడమటి కట్టకింద పల్లె, గుమ్మనంపాడు, దూబగుంట్ల, బోడవాడ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయన్నారు. మినుము ముదురు కాయలు చిట్టి మొలకలు వస్తుండగా, శనగా మొక్కదశలో పాడవుతోందన్నారు. వరి నేలకొరిగి దెబ్బతిందన్నారు. శనగ 757 హెక్టార్లలో, వరి 21 హెక్టార్లలో, మినుము 678 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు జిల్లా అధికారులకు నివేదిక ఇచ్చినట్లు పేర్కొన్నారు.



దాసళ్లపల్లి వద్ద పొంగి పొర్లుతున్న కొండవాగు



పెద్ద దాసళ్లపల్లిలో నీట మునిగిన పొగాకు, వరి



కనిగిరి పొలాల్లో నిలిచిన వర్షం నీరు



నాగుల చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ గఫార్



గుమ్మనంపాడులో కొట్టుకుపోయిన శనగను పరిశీలిస్తున్న రైతులు



ఎన్‌గొల్లపల్లి రిజర్వాయర్ కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్



టంగుటూరు: బస్టాండ్ ప్రాంతంలో కురిసిన వర్షానికి నిలిచిన నీరు

రెవెన్యూ రికార్డుల సవరణలకే సదస్సులు



రెవెన్యూ సదస్సుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సింగరాయకొండ: ప్రజల భూ హక్కు ప్రకారం రికార్డులలో తప్పులను సరిచేసేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ టి.రవి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామసభలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూముల రీ సర్వేను అధికారులు హడావుడిగా చేయడంతో రికార్డుల్లో కొన్ని తప్పులు వచ్చాయన్నారు. ప్రస్తుతం జరిగే గ్రామసభల్లో రికార్డుల ప్రకారం అడంగల్, ఒన్‌బీ ప్రకారం ప్రజలకు భూహక్కు సక్రమంగా ఉందో లేదో పరిశీలించి సవరణలు చేస్తామన్నారు. ఈనెల 6వ తేదీ బింగినపల్లిలో జరిగే గ్రామసభలతో కార్యక్రమం ప్రారంభమై డిసెంబర్ 7వ తేది శానంపూడిలో జరిగే గ్రామసభతో కార్యక్రమం ముగుస్తుందన్నారు. ఈ సందర్భంగా గ్రామసభలో జరిగే భూ సవరణలపై అధికారులకు సబ్‌రిజిస్ట్రార్ జాఫర్ వివరించారు. ముఖ్యమైన సమావేశానికి దేవాదాయ శాఖ అధికారులు గైర్హాజరయ్యారు. ఆర్‌ఐ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



లింగంగుంట్లలో మిరప తోటలు పరిశీలిస్తున్న ఉద్యాన వనశాఖ హెచ్ఓ అంజలిబాయి

హనుమంతునిపాడు: మండలంలోని లింగంగుంట్ల, రక్షణాపురం గ్రామాల్లో భారీ వర్షానికి నీటి మునిగిన మిరప, పండ్లతోటలను ఉద్యానవన శాఖ అధికారి ఎం.అంజలిబాయి గురువారం పరిశీలించారు. వర్షం నీరు బయటకు వెళ్లే అవకాశం ఉంటే వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. వర్షానికి తోటలు ఉరకెత్తకుండా తీసుకోవాల్సిన మెళకువలు, జాగ్రత్తలు, తెగుళ్ల ఆశిస్తే నివారణకు వాడాల్సిన మందులపై రైతులకు సూచనలు చేశారు. మిరపలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. మిరప, కంది, మినుము, వరి పంటలకు రైతులు పంటల బీమా ఈ నెల 15 లోగా ప్రీమియం చెల్లించాలన్నారు. వీఏఏలను సంప్రదించి మీసేవలో పంటల బీమా చెల్లించాలన్నారు. పంట నష్టపోతే బీమా వర్తిస్తుందన్నారు. ఆమె వెంట వీఏఏ శెట్టి శ్రీలక్ష్మీ, రైతులు ఉన్నారు.

సీఎస్‌పురం(పాములూరు): తుఫాన్ ప్రభావంతో మండలంలో గత 4 రోజు లపాటు కురిసిన వర్షాలకు మండలంలోని ఆర్‌కేపల్లి, అగ్రహారం, గోగులపల్లి, చెన్నపునాయునిపల్లి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో వరి, మినుము, శనగ పంటలు దెబ్బతిన్నాయని మండల వ్యవసాయాదికారి బి.సంపత్‌కుమార్ తెలిపారు. మినుము 400 హెక్టార్లు, వరి 25 ఎకరాల్లో, శనగ 45 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు తెలిపారు. పంట వివరాలను జిల్లా అధికారులకు తెలియజేసినట్లు తెలిపారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

మర్రిపూడి: మండలంలో ఈ నెల 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జ్వాలా నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. 6న కెల్లంపల్లి, 10 న ఎస్టీ రాజుపాలెం, గుండ్లసముద్రం, 11న కాకర్ల, 12 చిలంకూరు, 13న చిమట 17న రామాయపాలెం, 18న జువ్విగుంట, 19న ధర్మవరం, వెంకటకృష్ణాపురం, 20న తంగెళ్ల, 21న అయ్యపురాజుపాలెం, 24న నన్నమూరు, 26న మర్రిపూడి, 27న కూచిపూడి, 28న తిప్పలదేవిపల్లి, 31న గార్లపేట, వంకమర్రిపాలెం, జనవరి 2 న పన్నూరు, 3న అంకేపల్లి, గంజిపాలెం, 4న వేమవరం, రామచంద్రాపురం, 7న జి.అగ్రహారం, 8న వల్లాయపాలెం, గంజిపాలెం గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొండపి: మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పి.మురళి అన్నారు. మండలంలోని 22 గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. సదస్సులో మండల నోడల్ ఆఫీసర్, తహసీల్దార్, సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ సర్వేయర్ పాల్గొంటారన్నారు. మండలంలోని ప్రజలు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎస్‌పురం(పాములూరు): మండలంలో శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు డి.మంజునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం పెదగొగులపల్లి, విరించిపురం గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు.